క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : అట్లూరు మండల జెడ్పీటీసీ అందూరి నరమ్మ, మాజీ జెడ్పీటీసీ అందూరి రామకృష్ణారెడ్డి చిన్న కుమార్తె మమత వివాహ వేడకలు కడపలోని ఉమేష్ చంద్ర కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నియోజవకర్గం వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్ల సమన్వయ కర్త కల్లూరి రమణారెడ్డి, నియోజవర్గం ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘన సత్కారం

అట్లూరు : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) మెంబర్‌గా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి నియమితులైన సందర్భంగా పోరుమామిళ్ల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయనను వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్సీకి శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పుత్తా శ్రీరాములు, చెన్నకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రంపాటి తిరుపాల్ రెడ్డి, నాగులకుంట్ల కృష్ణారెడ్డి, ఎంఆర్‌ఎఫ్ రమణారెడ్డి, నాగులకుంట్ల వివేక్‌రెడ్డి, గుర్రంపాటి కృష్ణారెడ్డి, గుర్రంపాటి పోలిరెడ్డి, రమణయ్య, వెంకటసుబ్బయ్య, 11వ వార్డు ఇన్‌చార్జి సుబ్బరాజు, మాల్యాద్రి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంచాలి

కాశినాయన : మండలంలోని నిరుపేదలకు భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం నరసాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 217, 129 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కొంత మంది ఆక్రమణదారులు రాత్రి సమయాల్లో భూములను చదును చేయడం జరుగుతోందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమిత భూములను పేదలకు పంచకపోతే నెల 20వ తేదీన తహసీల్దార్ కార్యాయలాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, వీరయ్య, సుదర్శన్, బాబు, కిరణ్ పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ - సేవింగ్‌పై అవగాహన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 7 నుంచి 13వ తేదీ వరకు జీఎస్టీ 2.0 సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ పి.గురుమూర్తి రెడ్డి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ప్రయోజనాలు విద్యార్థులకు, ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

మైదుకూరు : అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీ రిజిస్ట్రేషన్ లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రోగ్రాం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి తెలిపారు. దేశంలో డిజిటల్ ఆరోగ్య వ్యవస్థను పటిష్టం చేయడంలో అభా ఐడీల పాత్ర ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. మైదుకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం అభా ఐడీ రిజిస్ట్రేషన్ ఏఎన్సీ (గర్భిణీల సంరక్షణ)లకు అభా లింక్, ఎలిజిబుల్ కపుల్‌కు అభా రిజిస్ట్రేషన్ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. మైదుకూరు, బద్వేలు మున్సిపాలిటీల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అభా రిజిస్ట్రేషన్ వివరాలపై డీపీఎంఓ శశిభూషణ్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ సమీక్ష చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డి.సుమధుర, అయేషా, హెల్త్ సూపర్‌వైజర్లు శివరామిరెడ్డి, వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్‌ఏలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రం చేసిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మైదుకూరు : మున్సిపాలిటీలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బడి, గుడి పరిసరాలను శుభ్రం చేశారు. కాలనీలోని రామాలయం పరిసరాల్లో, ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పరిశుభ్రంగా మార్చారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సేవా కార్యక్రమానికి సహకరించిన మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

కల్తీ మద్యంపై వెల్లువెత్తిన నిరసన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మహిళలు

కల్తీ మద్యంపై నిరసన వెల్లువెత్తింది. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు, మహిళలు కదం తొక్కారు. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో భారీ ఆందోళనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరులో వినూత్న ఆందోళన
- నకిలీ మద్యానికి పాడెకట్టి మహిళలు మోస్తూ ఊరేగింపు
- ర్యాలీలో కూటమిపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ధ్వజం

ప్రొద్దుటూరు : కల్తీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం భారీ ఆందోళన నిర్వహించారు. నకిలీ మద్యం పాడెను మోస్తూ, తోపుడు బండిపై నకిలీ మద్యం కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసి వినూత్న రీతిలో తెలిపిన నిరసన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. మహిళలు చేసిన నినాదాలతో పట్టణం దద్దరిల్లింది. అనంతరం ఎక్సైజ్ సీఐ సురేంద్రారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మొలకల చెరువు కల్తీ మద్యంపై సీబీఐ విచారణకు ప్రభుత్వం



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎందుకు ఆదేశించడం లేదని డిమాండ్ చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలను టార్గెట్ చేసి మొలకల చెరువు కల్తీ మద్యాన్ని అమ్ముతున్నారని తెలిపారు. పేదలు డబ్బు ఇచ్చి విషం కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రూ.130 మద్యం బాటిళ్లలోనే ఇలాంటి కల్తీ ఎక్కువగా జరుగుతోందని తెలిపారు. దీని వలన పదుల సంఖ్యలో గ్రామాల్లో మరణాలు సంభవిస్తున్నాయని, చాలా మంది పేదలకు కిడ్నీ, లివర్ చెడిపోతోందన్నారు. రాష్ట్రంలో 3396 మద్యం షాపులు ఉండగా లక్ష బెల్ట్ షాపులు ఉన్నాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మద్యం తాగడం వలనే మహిళల మెడలోని తాళిబొట్లు తెగిపోతున్నాయని, ఈ మరణాలు ప్రభుత్వ ఖాతాల్లో లేవన్నారు. మరణించిన వారికి ప్రభుత్వమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి కల్తీ మద్యం తాగి 420 మంది పేదలు చనిపోయారన్నారు. నకిలీ మద్యాన్ని అరికట్టే వరకు గాంధీ స్ఫూర్తితో తమ ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

లేకుంటే ఎక్సైజ్ పోలీసు స్టేషన్లపై మహిళలు దాడి చేసే పరిస్థితులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ జేష్టాది శారద, ఆప్కాబ్ మాజీ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, బాణా కొండారెడ్డి, పట్టణ అధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రొద్దుటూరు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, దొరసానిపల్లె ఎంపీటీసీ మేరీ, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, లావణ్య, పందిటి సరోజ, జయంతి, రావులకొలను అరుణ, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు నంగనూరుపల్లె శంకర్, మాచిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మాజీ కౌన్సిలర్లు శౌరి సుభాష్‌రెడ్డి, టప్పా బాషా, పిట్టా భద్రమ్మ, ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు చింతల దానమ్మ, మద్దూరి దేవి, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు గోటూరు వెంకటేష్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోసా మనోహర్, యువజన విభాగం తాలూకా అధ్యక్షుడు ద్వార్శల గురునాథరెడ్డి, పర్లపాడు మధుసూదన్‌రెడ్డి, టంగుటూరు గౌతమ్ రెడ్డి, సెల్ సుబ్బయ్య, మార్కెట్ దాదాపీర్, తొండలదిన్నె రాజారాంరెడ్డి పాల్గొన్నారు.

జనంతో కూటమి ప్రభుత్వం చెలగాటం



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ
- నకిలీ మద్యంపై ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడిగా కల్తీ మద్యం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం బద్వేలులో స్థానిక ఎన్‌జీవో కాలనీలోని వైఎస్ విగ్రహం నుండి సిద్ధవటంరోడ్డులోని ఎక్సైజ్ కార్యాలయం వరకు మహిళలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు నాణ్యమైన మద్యం అందిస్తామని, తక్కువ ధరలకే మద్యం అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు సర్కార్ అధికారంలోకి వచ్చాక ప్రజలకు కల్తీ మద్యాన్ని అంటకట్టి వారి జీవితాలతో చెలగాటమాడుతోందని అన్నారు. కూటమి నేతల ధనదాహం కోసం పేద ప్రజల ప్రాణాలను బలితీసుకోవాలని చూడటం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జి.సుందర్‌రామిరెడ్డి, ఆయా మండలాల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, హనుమంతరెడ్డి, సి.బాషా, సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ శారదమ్మ, మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు ఈశ్వరమ్మ, నియోజకవర్గ అధ్యక్షురాలు ముంతాజ్‌బేగం, ఎంపీటీసీ సరస్వతమ్మ, కౌన్సిలర్లు చక్రపాణిఉమ, బిజ్జంరాజేశ్వరి, వరలక్ష్మి, లక్షుమ్మలతో పాటు వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర, జిల్లా నాయకులు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ప్రజల ప్రాణాలు పోతుంటే.. కళ్లు మూసుకున్నారా?

- వైఎస్సార్‌సీపీ మహిళా శ్రేణులు మండిపాటు
- చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ధ్వజం

మైదుకూరు : నకిలీ మద్యంతో పేద ప్రజల ప్రాణాలు పోతుంటే కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ కళ్లు మూసుకున్నారా అంటూ మైదుకూరు వైఎస్సార్‌సీపీకి చెందిన మహిళా శ్రేణులు ధ్వజమెత్తారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ మైదుకూరులో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక తెలుగు గంగ కాలనీలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో నకిలీ మద్యాన్ని అరికట్టాలని, ఎన్ బ్రాండ్ నకిలీ మద్యానికి స్వస్తి చెప్పాలని, ఇది కల్తీ ప్రభుత్వం అంటూ మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు రక్షించాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ సీఐ ధీరజ్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పి.కిరణ్మయి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ములకలచెరువులలో కల్తీ మద్యం తయారీ బయట పడిందని, నకిలీ మద్యాన్ని సేవించి దాదాపు 400 మంది మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయని ఆరోపించారు. విజయవాడ కరకట్ట దగ్గరలోనే కల్తీ మద్యం తయారీ జరుగుతుంటే కళ్లమూసుకున్నారా అంటూ ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ మహిళా సంక్షేమం కోరే వారే అయితే మహిళల తరఫున నిలబడి కల్తీ మద్యంపై పోరాడాలని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు మాబు చాన్ మాట్లాడుతూ ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కల్తీ మద్యాన్ని, తయారీదారులను శిక్షించడమే కాక అరికట్టాలని, లేదంటే వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతృత్వంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంకర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కౌన్సిలర్లు పిల్లి ఇందిరా రమణి, వెంకటసుబ్బన్న, భరత్ కుమార్ రెడ్డి, రాఘవరెడ్డి, ధనలక్ష్మి, పిల్లి నాగయ్య, కందనూరు షరీఫ్, మాబు సాహెబ్, దుద్దు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళలు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు క్రైం : బాలికలను సంరక్షించుకోవడం మనందరి బాధ్యత అని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. 'సేవ్ ద గర్ల్ చైల్డ్' క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం గీతం బాలికల జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'బాలికను కాపాడండి' అనేది సమాజంలో ఆడపిల్లల రక్షణ, విద్య, సమాన హక్కుల కోసం నడిపే ఉద్యమమని చెప్పారు. ఆడపిల్ల పుట్టినప్పటి నుంచి ఆమె జీవితం విలువైనదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలనేదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఆడపిల్ల పుట్టడం పట్ల అసహనంగా ఉండటం, పుట్టక ముందే అమ్మాయి గర్భం తీసేయడం లాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. సమాజ అభివృద్ధి కోసం ఆడపిల్లల సహకారం అవసరమని తెలిపారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత

బాలురతో సమానంగా బాలికలను చదివించాలని, ఇతర రంగాల వైపు వారిని నడిపించాలని కోరారు. పిల్లలపై వివక్ష లేకుండా ప్రేమ, గౌరవం చూపాలన్నారు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్‌పై విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జయరాముడు, వైద్యాధికారి హిమబిందు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జీవాల వ్యాధులపై అవగాహన సదస్సు

మైదుకూరు : మండలంలోని పోతిరెడ్డిపల్లెలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం జీవాల్లో వచ్చే పలు వ్యాధులపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. మేకలు, గొర్రెల్లో వచ్చే కాలిపుండ్ల వ్యాధి, నీలి నాలుక వ్యాధి, పీపీఆర్ వ్యాధిపై, కోళ్లల్లో వచ్చే కొక్కెర తెగులు, కోళ్ల మసూచి, గుంబోరా వ్యాధులు వాటి నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను కేవీకే శాస్త్రవేత్తలు వివరించారు. జీవాల్లో అంతరపరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ, పశువులకు ఈ కాలంలో వేయాల్సిన టీకాల గురించి తెలియజేశారు. అనంతరం వైద్య శిబిరంలో జీవాలకు నట్టల నివారణ మందును తాపించారు. సదస్సులో కేవీకే అధిపతి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ, పశు వైద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి.విజయనిర్మల, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ కాంతిశ్రీ, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ పాల్గొన్నారు.



జీవాలకు నట్టల నివారణ మందు తాపుతున్న శాస్త్రవేత్తలు

సంస్కృతి పరిరక్షకులు పగటివేషధారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : సంస్కృతి పరిరక్షకులు పగటివేషధారులని సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో సోమవారం పగటి వేషధారులకు సత్కరించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పగటి వేషదారులు ఊరూరా తిరిగుతూ పద్యాలు ఆలపించి 11వ రోజున ధన ధాన్యాలు సేకరించుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. మన దేశ సంస్కృతిని కాపుడుతున్న వీరికి ప్రభుత్వం తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హరికథ భాగవతార్ యడవల్లి రమణయ్య, షేక్షావల్లి తదితరులు పాల్గొన్నారు.



పగటి వేషధారులను సన్మానిస్తున్న ఒంటేరు శ్రీనివాసులరెడ్డి

నగరవనం ఏర్పాటులో అవినీతిపై విచారణ చేపట్టాలి

గోపవరం : మండలంలోని సెంచురీ పానెల్స్ సమీపంలో ఎన్‌హెచ్–67 జాతీయ రహదారి పక్కనే అటవీశాఖ చేపట్టిన నగరవనంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ బృందంతో కలిసి నగరవనాన్ని పరిశీలించారు. నగరవనం ఏర్పాటుకు లక్షల రూపాయలు ఖర్చు చేశారని, అక్కడ మాత్రం బోదగుడారాలు, సిమెంటు బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు మాత్రమే కనిపిస్తున్నాయని అన్నారు. ఇన్ని లక్షల రూపాయలు ఖర్చుపెట్టి చేసిన అభివృద్ధి ఇదేనా అని ఆయన అధికారులను ప్రశ్నించారు. పరిశ్రమకు కూతవేటు దూరంలోనే ఈ నగరవనం ఏర్పాటు చేశారని, ఇక్కడకు వచ్చే ప్రజలు పరిశ్రమలో నుండి వచ్చే కాలుష్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. పరిశ్రమ నుండి వచ్చే దుర్వాసన రెండు, మూడు కిలోమీటర్ల వరకు వస్తుందని, ఇలాంటి పరిస్థితుల్లో అక్కడ నగరవనం ఏర్పాటు చేయడం ఎంతవరకు సబబు అని అధికారులను ప్రశ్నించారు. నగరవనం ఏర్పాటు చేయడంలో కొందరు అధికారుల అవినీతికి పరాకాష్టగా మారిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఏ జిల్లా నాయకులు అనిల్, పార్టీ నాయకులు రామరాజు, ఏరియా కమిటీ సభ్యులు బాబు, విజయరావు, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

కలసపాడు : ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్లు ఖరారు చేయడం, మార్గ నిర్దేశం చేసేందుకు మంత్రుల సమూహ కమిటీ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతులపై ఏర్పాటు చేసిన కమిటీ కాలయాపన చేయకుండా వీలైనంత త్వరగా ఎక్కువ మందికి పదోన్నతి అవకాశం కల్పించాలన్నారు. సీనియర్ పే స్కూల్‌కు సమానమైన పే స్కేల్ ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఇంటింటి సర్వేల నుండి విముక్తి కల్పించాలన్నారు. స్పష్టమైన జాబ్ చార్ట్ అమలు చేయాలని కోరారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

బి.కోడూరు : రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు చేపట్టిన సమ్మె న్యాయమైనదని, న్యాయపరమైన డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సీహెచ్‌ఓ పుష్పాంజలి కోరారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా బి.కోడూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్యుల సమస్యలను, వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. వైద్యులు గ్రామీణ, దూర ప్రాంతాల్లో తీవ్ర ఇబ్బందులతో ప్రజలకు సేవలు అందిస్తున్నప్పటికీ వారికి సరైన గుర్తింపు, ప్రోత్సాహం లభించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యులకు సంఘీభావం

మైదుకూరు : గత కొద్ది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు మద్దతుగా సోమవారం వైద్య సిబ్బంది సంఘీభావం తెలిపారు. మైదుకూరులో సామాజిక ఆరోగ్య కేంద్రంలో అభా ఐడీ రిజిస్ట్రేషన్లపై అధికారులు నిర్వహించిన సమీక్షకు హాజరైన వైద్య సిబ్బంది, సమీక్ష అనంతరం వైద్యుల సమ్మెకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శి.శివరామిరెడ్డి, డి.వెంకటేశ్వర్లు, కె.వీరాంజనేయులు, బీజే పద్మావతి, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి హేయమైన చర్య

బద్వేలు అర్బన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని, ఇందుకు కారకుడైన అడ్వకేట్‌ను కఠినంగా శిక్షించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షుడు యర్రబల్లె ఓబయ్య పేర్కొన్నారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ సోమవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ నాయకులు దేవానందం, డాక్టర్ వెంకటసుబ్బయ్య, జాలాగురయ్య, ఓసూరిభాస్కర్, దళిత సంఘాల నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, పిచ్చయ్య, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు బాలయ్య, జయచంద్ర, సి.వి.రమణ, రాజన్న, సుధాకర్, రమణ, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

8 గంటల పని విధానం కొనసాగించాలి

ప్రొద్దుటూరు : 13 గంటల పని విధానాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య, చైతన్య ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విజయకుమార్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ సెప్టెంబర్ 19న రాష్ట్ర అసెంబ్లీలో ప్రపంచ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని హక్కును రద్దు చేస్తూ 13 గంటల పని చేయాలని, ఒక రోజు టైంలో రోజున్నర పని చేయాలని తీర్మానించారని తెలిపారు. గతంలో మహిళా కార్మికులు పరిశ్రమల్లో కానీ, కంపెనీల్లో కానీ, షాపుల్లో కానీ పగలు షిఫ్టులు మాత్రమే పని చేసే వారన్నారు. ఈ అసెంబ్లీ తీర్మానంతో మహిళా కార్మికులు కూడా నైట్ షిఫ్టులో పని చేయాలని, వారి రక్షణ గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. ఆటో ఓనర్లకు ఇచ్చిన రూ.15 వేలు డ్రైవర్లందరికీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య నాయకులు నాగేంద్ర, సృజన శ్రీను, ఏఐటీయూసీ నాయకులు శివారెడ్డి, చైతన్య ఆటో డ్రైవర్ యూనియన్ నాయకుల శరత్, సుదర్శన్, ప్రతాప్, రసూల్, హరి, శివ, కుళ్లాయప్ప, రాయలసీమ మహిళా శక్తి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీదేవి, హరిత తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న యూనియన్ల నాయకులు

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



ప్రొద్దుటూరులో సీపీఆర్ పద్ధతి చూపిస్తున్న వైద్యులు



బి.కోడూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు క్రైం : సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తెలిపారు. స్థానిక టీబీరోడ్డు అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం సీపీఆర్‌పై క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సంద్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఆర్ అంటే హృదయ శ్వాస పునరుద్ధరణ చర్య అని, ఇది ఒక అత్యవసర వైద్యపద్ధతి అని తెలిపారు. గుండె లేదా శ్వాస ఆగిపోయిన వ్యక్తిని తిరిగి ప్రాణాలతో ఉంచేందుకు ఈ పద్ధతిని ఉయోగిస్తారన్నారు. గుండె, శ్వాస ఆగిపోవడం, విద్యుత్ షాక్ తగిలినప్పుడు సీసీఆర్ చేస్తే మెదడు, ముఖ్య అవయవాలకు ఆక్సిజన్, రక్తప్రసరణ సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సమయానికి సీపీఆర్ చేస్తే మనిషి ప్రాణాలను కాపాడవచ్చన్నారు.

బి.కోడూరు : బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ స్పృహ కోల్పోయిన వారు, యాక్సిడెంట్ అయిన వారు, నీటిలో మునిగి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడే వారు, గుండెపోటుకు గురైన వారికి ఛాతీపై హ్యాండ్ ఇంటర్ లాక్ చేసి ఒత్తిడి పెంచి శ్వాస తీసుకోని వారికి రికవరీ అయ్యే వరకు చేతులతో సీపీఆర్ చేయడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పుష్పాంజలి, ఆప్తాల్మిక్ ఆఫీసర్ హుస్సేనయ్య, సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్‌లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత

గోపవరం : పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, అందుకే పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు గోపవరం పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు సోమవారం గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసపురం, పెద్దగోపవరం, చిన్నగోపవరం, సంగసముద్రం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎరువు దిబ్బలను తొలగించడంతో పాటు మురికినీరు నిల్వ ఉన్న చోట పూడికలు తీయించారు. ప్రజలు కూడా పరిశుభ్రత విషయంలో అధికారులకు సహకరించాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ తడి, పొడి చెత్త రోడ్లపైన వేయవద్దన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఇళ్ల వద్దకే వస్తారని, అప్పుడు మాత్రమే తడి, పొడి చెత్తలను వారికి అందించాలన్నారు. ఇళ్ల పరిసరాల చుట్టూ మురికినీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత స్థానికులదే అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వివిధ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటికి దోమలు కారణమన్నారు. వాటిని అరికట్టేందుకు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లిస్తున్నామని తెలిపారు. ప్రతి శుక్రవారం తాగునీటి పథకాలను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ప్రస్తుతం పారిశుద్ధ్య పనులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఈ విషయంలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు.



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు